సాంకేతికతతో ఉపయోగం


సదస్సులో పాల్గొన్న అతిథులు, ప్రతినిధులు

శంషాబాద్ రూరల్: స్థిరమైన వ్యాపారం కోసం వినూత్నంగా, సానుకూలమైన నమూనాల రూపకల్పన కోసం సాంకేతికత ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని సింబయాసిస్ యూనివర్సిటీలోని ఇనిస్టిట్యూట్ ఆఫ్ బిజినెస్ మేనేజ్మెంట్ డైరెక్టర్ డాక్టర్ కేపీ వేణుగోపాలారావు అన్నారు. మండలంలోని వర్ధమాన్ ఇంజినీరింగ్ కళాశాల మాస్టర్ ఆఫ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ విభాగం, ఆర్కే విశ్వవిద్యాలయం సంయుక్త ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు నిర్వహించిన 'డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ అండ్ సస్టైనబిలిటి ఆఫ్ బిజినెస్' అనే అంశంపై నిర్వహించిన అంతర్జాతీయ హైబ్రిడ్ సదస్సు శనివారం ముగిసింది. ఆయన ముఖ్య అతిథిగా హాజరై సదస్సు ఆవశ్యకతను తెలియజేశారు. ప్రిన్సిపాల్ డాక్టర్ జేవీ రవీంద్రరావు మాట్లాడుతూ.. డిమాండ్‌కు తగ్గట్టుగా స్థిరమైన పర్యావరణ వ్యవస్థను రూపొందించేందుకు వ్యాపారంలో డిజిటల్ సాంకేతికత సహకారం ప్రాముఖ్యతను వివరించారు. చివరిరోజు నిర్వహించిన ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో మేనేజ్‌మెంట్ స్టడీస్ విభాగాధిపతి, ప్రొఫెసర్ డాక్టర్ సుకన్య తదితరులు పాల్గొన్నారు.

రాజేంద్రనగర్‌లో 5కే రన్ ప్రారంభం


5కే రన్‌ను ప్రారంభిస్తున్న రాజేంద్రనగర్ ఆర్‌డీఓ వెంకట్ రెడ్డి

రాజేంద్రనగర్: లోక్‌సభ ఎన్నికల్లో భాగంగా ఈసీ ఆదేశాల మేరకు ఓటింగ్ శాతం పెంచేందుకు స్వీప్ యాక్టివిటీలో భాగంగా రాజేంద్రనగర్ ఆర్‌డీఓ వెంకట్ రెడ్డి శనివారం 5కే రన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డైరీఫామ్ సిగ్నల్ నుంచి రాజేంద్రనగర్ వరకు రన్‌ను నిర్వహించామన్నారు. కార్యక్రమంలో స్వీప్ యాక్టివిటీ నోడల్ ఆఫీసర్ బి.శరత్ చంద్ర, రాజేంద్రనగర్ సర్కిల్ డీసీ రవికుమార్, రంగారెడ్డి జిల్లా మెప్మా ఏఓ జ్ఞానేశ్వర్, డీఆర్‌డీఏ పీడీ శ్రీలత, ఏపీడీ సూర్యారావు, మున్సిపల్ కమిషనర్లు, తహసీల్దార్లు, వెటర్నరీ కాలేజీ ప్రొఫెసర్లు, విద్యార్థులు, రెవెన్యూ, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

సీబీఐటీ విద్యార్థులకు అవార్డు


అవార్డు సాధించిన స్టూడెంట్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ నరసింహులు

మణికొండ: హైదరాబాద్‌లోని టీహబ్ 2.0లో ఐక్యరాజ్య సమితి నమూనాలో కాంకోర్డియా మోడల్ యునైటెడ్ నేషన్స్‌లో డిప్యూటీ సెక్రటరీ జనరల్, చార్జ్ డి అఫైర్స్‌గా పని చేసిన గండిపేటలోని సీబీఐటీ కళాశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు అవార్డులు సాధించారు. శనివారం కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సీవీ నరసింహులు విద్యార్థులు ఆకాష్ కోటి, జయేష్ శ్రీనివాస్‌రెడ్డిని అభినందించారు. కార్యక్రమంలో మెకానికల్ ఇంజినీరింగ్ హెచ్ఓడీ ప్రొఫెసర్ పి.ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నీటి సంపుల తొలగింపు


వట్టినాగులపల్లిలో నీటి సంపులను తొలగిస్తున్న రెవెన్యూ అధికారులు

మణికొండ: పొలాల్లో బోర్లు వేసి ట్యాంకర్లతో నీటి వ్యాపారం చేస్తున్న వారిపై శనివారం రెవెన్యూ అధికారులు కొరడా ఝులిపించారు. గండిపేట తహసీల్దార్ నర్రా శ్రీనివాస్‌రెడ్డి ఆదేశాల మేరకు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు విక్రంరెడ్డి, సురేశ్ ఆధ్వర్యంలో బృందాలు ఖానాపూర్, వట్టినాగులపల్లి గ్రామాల్లో తాత్కాలికంగా ఏర్పాటు చేసిన నీటి సంపులను జేసీబీలతో పూడ్చివేయడంతో పాటు మోటార్లను స్వాధీనం చేసుకున్నారు. మరోసారి నీటి వ్యాపారం చేస్తే వాళ్లా చట్టం ప్రకారం క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని రెవెన్యూ అధికారులు హెచ్చరించారు.

'రంజిత్ రెడ్డిని గెలిపించుకుంటాం'


చేవెళ్ల ఎంపీ అభ్యర్థి రంజిత్ రెడ్డిని కలిసిన గోవర్ధన్ రెడ్డి తదితరులు

అత్తాపూర్: చేవెళ్ల కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న రంజిత్ రెడ్డిని గెలిపించుకుంటామని రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి మంగళారం గోవర్ధన్ రెడ్డి, అత్తాపూర్ డివిజన్ అధ్యక్షుడు ప్రవీణ్ రెడ్డి అన్నారు. శనివారం రంజిత్ రెడ్డిని తన నివాసంలో వారు కలిశారు. ఈ సందర్భంగా వారు సిద్ధం చేసిన ప్రణాళికపై చర్చించారు. కార్యక్రమంలో నాయకులు ఖలీద్ బాయి, నాగేందర్ రెడ్డి, భాస్కర్ గౌడ్, హనుమంత్ రెడ్డి, జనార్దన్ రెడ్డి, ప్రీతం రెడ్డి, బండారి రమేశ్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో బాలుడి మృతి

గోల్కొండ: రోడ్డు ప్రమాదంలో గోల్కొండ నయాఖిలాకు చెందిన బాలుడు మృతి చెందాడు. శుక్రవారం ఉదయం షేక్‌పేట్ ఫ్లైఓవర్‌పై బైక్‌పై వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. ఉస్మాన్ అలీ వరుసకు తన సోదరుడైన అఫాన్‌తో కలిసి షేక్‌పేట్ ఫ్లైఓవర్‌పై వెళ్తుండగా బైక్ అదుపు తప్పి ఫ్లైఓవర్ రేయిలింగ్‌ను ఢీకొట్టారు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడ్డ ఉస్మాన్ అలీని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్పించారు. కాగా చికిత్స పొందుతూ అదేరోజు సాయంత్రం మృతి చెందాడు. ఉస్మాన్ అలీ గోల్కొండలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్నాడు.

సేవా కార్యక్రమాలు నిర్వహించాలి



వైద్య శిబిరంలో పాల్గొన్న వీకే పాటిల్ తదితరులు

మైలార్‌దేవ్‌పల్లి: విద్యార్థులు చదువుతో పాటు సమాజ సేవా కార్యక్రమాలు చేపట్టడం అలవర్చుకోవాలని మహవీర్ కళాశాల జాయింట్ సెక్రటరీ సంరెడ్డి ధనంజయ్‌రెడ్డి, ఎన్ఎస్ఎస్ కార్యనిర్వాహణ అధికారి వీకే పాటిల్ అన్నారు. నక్షత్ర ఆసుపత్రి సౌజన్యంతో ఎన్ఎస్ఎస్ విద్యార్థులతో కలిసి లేమూర్ గ్రామాన్ని దత్తత తీసుకుని శనివారం ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. సుమారు 200 మందికి పరీక్షలు చేసి మందులు అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. గ్రామాల్లో మౌలిక వసతులు కల్పనకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో నక్షత్ర హాస్పిటల్ డాక్టర్లు సోమ శేఖర్‌రెడ్డి, చంద్రప్రకాశ్, కృష్ణతులసీ, ప్రవీణ్, ఫౌజియా, నస్రత్ తదితరులు పాల్గొన్నారు.

సన్‌సిటీలోని షాలినీ హాస్పిటల్ ఆధ్వర్యంలో..


రోగులకు పరీక్షలు చేస్తున్న వైద్యులు

బండ్లగూడ: బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ అభ్యుదయానగర్ కాలనీ కమ్యూనిటీహాల్‌లో సన్‌సిటీలోని షాలినీ హాస్పిటల్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి అనూహ్య స్పందన వచ్చింది. ఈ సందర్భంగా డాక్టర్ షాలినీ సిబ్బందితో కలిసి కంటి పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తమ హాస్పిటల్‌లో అత్యాధునిక పరికరాలు అందుబాటులో ఉన్నాయని, అలాగే తక్కువ ధరల్లోనే మెరుగైన వైద్యం అందిస్తున్నామన్నారు. అలాగే హైదర్షాకోట్‌లో గల థైరోకేర్ డయాగ్నోస్టిక్ సెంటర్ సిబ్బంది ఉచితంగా రక్త పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో నాగుల నరేందర్, కాలనీవాసులు నరేందర్‌బాబు, రమణారావు, రామలింగం, మల్లికార్జున్, మోహన్, వంశీ, క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

తోటల పెంపకంలో తెలంగాణది ప్రత్యేక స్థానం

ఉద్యాన విశ్వవిద్యాలయం వీసీ నీరజాప్రభాకర్ ● యూనివర్సిటీలో అవకాడో తోటల పెంపకంపై అవగాహన


అవకాడో పండ్ల తోటల పెంపకం సదస్సును ప్రారంభిస్తున్న వీసీ, అధికారులు



ఇజ్రాయెల్ దేశానికి చెందిన శాస్త్రవేత్తకు జ్ఞాపికను అందజేస్తున్న వీసీ

ఏజీవర్సిటీ

ప్రపంచంలోనే పండ్ల తోటల పెంపకంలో తెలంగాణకు ప్రత్యేక స్థానం ఉందని, భవిష్యత్‌లోనూ కొనసాగించేందుకు ఉద్యాన విద్యార్థులు, శాస్త్రవేత్తలు, అధికారులు కృషి చేయాలని ఉద్యాన విశ్వవిద్యాలయం వీసీ నీరజాప్రభాకర్ అన్నారు. కొండా లక్ష్మణ్ ఉద్యాన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో ఐజీ డెక్కన్ ఎక్సోటిక్స్ సహకారంతో యూనివర్సిటీలో శాస్త్రీయ పరిజ్ఞానంతో అవకాడో తోటల పెంపకంపై శనివారం అవగాహన సదస్సు నిర్వహించగా ఆమె ప్రారంభించారు. అనంతరం అవకాడో మొక్కల పెంపకం ప్రాముఖ్యత, వాటిలోని ఔషధ గుణాలను వివరించారు. భవిష్యత్‌లో రాష్ట్రంలో అవకాడో తోటల పెంపకాన్ని దృష్టిలో పెట్టుకొని విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో ఫల పరిశోధనా స్థానం సంగారెడ్డిలో ప్రారంభించామని తెలిపారు. అదేవిధంగా ఆదిలాబాద్, అశ్వరావుపేట పరిశోధనా కేంద్రాల్లోనూ నూతన శాస్త్రీయ పరిజ్ఞానంతో అవకాడో పండ్ల పై పరిశోధన చేసి వాటి ఫలాలను క్షేత్రస్థాయిలో రైతులకు అందించేందుకు యూనివర్సిటీ శాస్త్రవేత్తలు కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం మాజీ వీసీ ప్రవీణ్‌రావు మాట్లాడుతూ నేషనల్ బ్యూరో ఆఫ్ సైన్స్ సహకారంతో తోటలు పెంచే నేలల సమగ్ర సమచారాన్ని తెలుసుకోవాలన్నారు. అలాగే డాక్టర్ శ్రీనివాస్‌రావు నిర్వహిస్తున్న అవకాడో క్షేత్రాన్ని రైతులు సందర్శించాలని సూచించారు. అవకాడో పండ్లలోని పోషణ ప్రొఫైల్స్ వాటి డిమాండ్ రీత్యా విరివిగా తోటలను పెంచాలని కోరారు. ఇజ్రాయెల్‌కు చెందిన హస్కల్బర్గ్ నర్సరీస్ క్వాలిటీ కంట్రోల్ మేనేజర్ అవకాడో నర్సరీల ప్రాముఖ్యత వాటి పరిణామక్రమాలు, ప్రపంచ స్థాయిలో పండ్లకున్న ప్రాముఖ్యత డిమాండ్‌ను వివరించారు. ప్రధానంగా భారతదేశంలో అవకాడో తోటల పెంపకం ఆవశ్యకత వాటి పరిస్థితుల గురించి కూలంకుషంగా రైతులకు వివరించారు. కార్యక్రమంలో అసోసియేట్ డీన్ డాక్టర్ ప్రశాంత్, ఐఐహెచ్ఆర్ ప్రిన్సిపాల్ సైంటిస్ట్ డాక్టర్ కరుణాకర్, అమిత్ శర్మ, శ్రీనివాస్‌రావు, డాక్టర్ సురేశ్‌కుమార్, డాక్టర్ సాయికృష్ణ నిఖిల్, రైతులు, బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

'విద్యారంగాన్ని నిర్లక్ష్యం చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం'


మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి నాగరాజు

శంషాబాద్: గత బీఆర్ఎస్ సర్కారు మాదిరిగానే ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం కూడా విద్యారంగాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేస్తున్నదని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి నాగరాజు మండిపడ్డారు. పట్టణంలో ఎస్ఎఫ్ఐ రంగారెడ్డి జిల్లా 25 మహాసభలను శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సంక్షేమ వసతి గృహాలకు తొమ్మిది నెలలుగా డైట్ బిల్లులు చెల్లించకపోవడంతో విద్యార్థులకు పోషకాహారం అందడం లేదన్నారు. అలాగే స్కాలర్ షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల చెల్లింపులో కూడా జాప్యం చేస్తున్నదని ఆరోపించారు. విద్యార్థి సమస్యల పరిష్కారంలో ఎస్ఎఫ్ఐ ముందుంటుందన్నారు. కార్యక్రమంలో నాయకులు శంకర్, ప్రణయ్, చరణ్, శివ, శ్రీకాంత్, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

'అగ్ని ప్రమాదంపై సమగ్ర విచారణ జరిపించాలి'


అగ్ని ప్రమాదం జరిగిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న నాయకులు

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ కాటేదాన్ పారిశ్రామిక ప్రాంతంలో పహాల్ ఫుడ్ ప్రైవేట్ లిమిటెడ్‌లో అగ్ని ప్రమాదంపై సమగ్ర విచారణ జరిపించాలని సీపీఐ కంట్రోల్ కమిషన్ సభ్యుడు పుస్తకాల నర్సింగ్ రావు, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఓరుగంటి యాదయ్య డిమాండ్ చేశారు. సీపీఐ మండల కార్యదర్శి ఎం.ఏ.రియాజ్ ఆధ్వర్యంలో సీపీఐ, ఏఐటీయూసీలతో కూడిన బృందం దగ్ధమైన బిస్కెట్ కంపెనీని శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 1998లో ఏర్పాటు చేసిన పహాల్ బిస్కెట్ కంపెనీలో వందలాది మంది కార్మికులు పని చేస్తున్నారని, అయినప్పటికీ అగ్ని మాపక నివారణ చర్యలు తీసుకోవడంలో యజమాన్యం పూర్తిగా విఫలమైందన్నారు. కార్మికుల ప్రాణాలను పణంగా పెట్టి కంపెనీ యజమాన్యం వస్తువులను ఉత్పత్తి చేస్తుందన్నారు. ఒకవిధంగా చెప్పాలంటే కంపెనీ నిర్మాణమే నిబంధనలను వ్యతిరేకంగా ఉందన్నారు. పరిశ్రమలో తనిఖీలు చేయకుండా వివిధ డిపార్ట్‌మెంట్ అధికారులను కంపెనీ యజమాన్యం లోపరుచుకున్నట్లుగా తమ పరిశీలనలో తెలిసిందని ఆరోపించారు. కంపెనీ యజమాన్యం తప్పిదాలను కప్పిపుచ్చి బీమా క్లైయిమ్ చేసేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తుందన్నారు. కంపెనీ యజమాన్యంపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వారి వెంట సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు ఆఫ్సర్, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఎస్.మల్లేశ్, స్వామి, సత్తయ్య పాల్గొన్నారు.

ఓవర్‌లోడ్‌తో పరేషాన్..


అధిక లోడ్‌తో వెళ్తున్న టిప్పర్

బండ్లగూడ: ఓవర్‌లోడ్ వాహనాలతో ప్రయాణికులు, ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. హైదరాబాద్-బీజీపూర్ జాతీయ రహదారిపై నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఇందులో భారీ, మినీ టిప్పర్లు కంకర, ఇసుక, ఇటుకలు, బండరాళ్లను మోతాదుకు మించి తీసుకెళ్తుండడంతో అవి ఎప్పుడూ కింద పడిపోతాయోనని వెనకాల వచ్చే వాహనదారులు బిక్కుబిక్కుమంటూ ప్రయాణాలు సాగిస్తున్నారు. ఇప్పటికే పలు ప్రమాదాలు జరిగాయని, మరోసారి ఘటనలు జరగకముందే అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

'కోట' జిగేల్



గోల్కొండ: గోల్కొండ కోట విద్యుత్ కాంతులతో జిగేల్ మంటుంది. కొన్ని నెలల క్రితం కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి కోటలో ఆధునీకరించిన లైట్ అండ్ సౌండ్ షోతో పాటు గోల్కొండ కోటకు విద్యుత్ దీపాలతో అలంకరించే కార్యక్రమాన్ని ప్రారంభించారు. అయితే కొన్ని రోజుల పాటే కొనసాగిన ఈ లైట్‌ల ఏర్పాటు ఆగిపోయింది. శుక్రవారం నుంచి అధికారులు మళ్లీ కోటకు పోకాడ్‌లైట్లు వేస్తున్నారు. చీకటి పడగానే ఈ లైట్లు వేస్తున్నామని అధికారులు తెలిపారు. రాత్రి 7 గంటల తర్వాత జిగేల్ మంటున్న కోటను చూసేందుకు పర్యాటకులు పెద్ద ఎత్తున తరలివస్తున్నారు.

ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్


ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్

రాజేంద్రనగర్: బుద్వేల్ గ్రామంలో కోరని రవీందర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఇఫ్తార్ విందులో రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్ పాల్గొన్నారు. కార్యక్రమంలో నయీం, సయ్యద్ సాదిక్, షంషేర్, మాజీద్ అహ్మద్, సలీం, దేవదాస్, కోరని శ్రావణ్ కుమార్, చెన్నయ్య, షేక్ ఖలీద్, ముజామిల్, కె.చెన్నయ్య, అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్ సందర్శన


మహిళా శిక్షణ కానిస్టేబుళ్లకు అవగాహన కల్పిస్తున్న సీఐ హరికృష్ణారెడ్డి, ఎస్సైలు

మణికొండ: రాష్ట్ర పోలీస్ అకాడమీలో శిక్షణ పొందుతున్న మహిళా కానిస్టేబుళ్లు నార్సింగి పోలీస్‌స్టేషన్‌ను శనివారం సందర్శించారు. వారికి ఇన్‌స్పెక్టర్ హరికృష్ణారెడ్డి ఆధ్వర్యంలో ఎస్సైలు, హెడ్ కానిస్టేబుళ్లు పోలీస్ స్టేషన్ నిర్వహణ, కేసుల నమోదు, పరిష్కారం, విచారణ తదితర విషయాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ప్రజలకు ప్రత్యక్ష సేవలు చేసే ఉద్యోగాల్లో పోలీసు ఉద్యోగం ఒకటని, శిక్షణ కాలంలో పూర్తి స్థాయిలో వ్యవస్థపై అవగాహన పెంచుకుని ఉద్యోగంలోకి రావాలని సూచించారు.

ఎట్టకేలకు పూర్తయిన రోడ్డు పనులు


ట్రయల్స్ విల్లాల ముందు పూర్తయిన రోడ్డు పనులు

మణికొండ: రాయదుర్గం– మణికొండ మధ్య 4 నెలలుగా జరుగుతున్న బాక్స్ డ్రైన్, రోడ్డు పనులు ఎట్టకేలకు పూర్తయ్యాయి. మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని పంచవటికాలనీ పక్క నుంచి ఉన్న పందెన్‌వాగు వర్షాకాలంలో పొంగి ప్రవహించడంతో అపార్ట్‌మెంట్లు, ఇండ్లల్లోకి వరద వస్తుండేది. దానిని నివారించే క్రమంలో మున్సిపాలిటీ నిధులు రూ.9.80 కోట్లతో బాక్స్ డ్రైన్ పనులు చేపట్టారు. అందులో భాగంగా ట్రయల్స్ విల్లాల ముందు ప్రధాన రోడ్డుపై డ్రైన్‌ను నిర్మించాల్సి వచ్చింది. దాంతో రోడ్డును మూసేసి పనులు చేపట్టారు. నెల రోజుల్లో పూర్తి చేస్తామని ట్రాఫిక్ పోలీసుల నుంచి అనుమతులు తీసుకుని ఏకంగా 4 నెలల పాటు కొనసాగించారు. ట్రాఫిక్‌ను చిన్న గల్లీ రోడ్ల నుంచి మళ్లించడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఎట్టకేలకు పనులు పూర్తి కావడం, రోడ్డు ఎత్తును పెంచడంతో రాకపోకలకు సిద్ధమయ్యింది. సిమెంట్ క్యూరింగ్ కోసం ఏర్పాటు చేసిన కట్టలు ఉన్నాయని, ఆ పనులను కూడా ఒకటి, రెండు రోజుల్లో పూర్తి చేస్తామని జీహెచ్ఎంసీ ఇంజినీరింగ్ అధికారులు తెలిపారు.

సీఎంను కలిసిన మహ్మద్ గౌస్ అలీ


సీఎం రేవంత్‌తో మహ్మద్ గౌస్ అలీ

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ డివిజన్ కాంగ్రెస్ మైనార్టీ విభాగం అధ్యక్షుడు మహ్మద్ గౌస్ అలీ డివిజన్ పార్టీ అధ్యక్షుడు భాస్కర్ రెడ్డితో కలిసి సీఎం రేవంత్ రెడ్డిని శనివారం కలిశారు. ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డికి మైనార్టీ విభాగం తరఫున శుభాకాంక్షలు తెలిపారు. వారి వెంట మైనార్టీ విభాగం నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

ఎంపీ రంజిత్ రెడ్డిని..


చేవెళ్ల ఎంపీ రంజిత్ రెడ్డితో ఆలయ కమిటీ ప్రతినిధులు

రాజేంద్రనగర్: బుద్వేల్ శివాంజనేయ ఆలయ కమిటీ సభ్యులు చేవెళ్ల ఎంపీ రంజిత్ రెడ్డిని శనివారం కలిశారు. వారిలో దేవదాస్, సత్యనారాయణ గౌడ్, పెంటయ్య గౌడ్, నందు గౌడ్, పెండ్యాల శ్రీధర్, నరసింహా గౌడ్, వినయ్ గౌడ్ చారి, అంజయ్య తదితరులు ఉన్నారు.

రేపు విగ్రహ ప్రతిష్ఠ

రాజేంద్రనగర్: బుద్వేల్ టీచర్స్ కాలనీ కట్ట మైసమ్మ ఆలయంలో ఏప్రిల్ 1వ తేదీన సోమవారం ఉదయం 11.15 గంటలకు శ్రీ నాగేంద్ర స్వామి దివ్య ప్రతిష్ఠ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 6.30 నుంచే పలు పూజా కార్యక్రమాలు చేపడుతామని పేర్కొన్నారు.

కార్పొరేషన్ అధ్యక్షుడిని నియమిస్తాం

బండ్లగూడ: బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ బీఆర్ఎస్ అధ్యక్షుడిగా అంతారం నరేశ్‌ను నియమించనున్నట్లు రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్ తెలిపారు. శనివారం ఎమ్మెల్యేను నరేశ్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నరేశ్ మాట్లాడుతూ బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో బీఆర్ఎస్ బలమైన శక్తిగా ఉందన్నారు. అందరి సహకారంతో పార్టీని మరింత బలోపేతం చేస్తానన్నారు. ఏ ఎన్నికలు వచ్చిన పార్టీ గెలుపే లక్ష్యంగా పని చేస్తామని పేర్కొన్నారు.

ముగిసిన పదో తరగతి పరీక్షలు

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ నియోజకవర్గంలో పదో తరగతి పరీక్షలు శనివారం ముగిశాయి. గండిపేట్ మండలపరిధిలోని 11 సెంటర్లలో 2562 మంది విద్యార్థులకు 2549 మంది, అలాగే రాజేంద్రనగర్ మండలపరిధిలో 20 కేంద్రాల్లో 4703 మందికి 4681 మంది పరీక్షకు హాజరైనట్లు ఎంఈవో రామిరెడ్డి తెలిపారు.

అంకితభావంతో పనిచేస్తే గుర్తింపు


రిటైర్డ్ అయిన వారితో ఉద్యోగులు

ఏజీవర్సిటీ: ఉద్యోగులు అంకితభావంతో పని చేస్తే గుర్తింపు ఉంటుందని వ్యవసాయ విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ వెంకటరమణ అన్నారు. యూనివర్సిటీ సూపరింటెండెంట్ పాపయ్య, నాలెడ్జ్ మేనేజ్‌మెంట్ సెంటర్ జూనియర్ లైబ్రరీ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న ఫయాజ్ అహ్మద్‌లు శనివారం ఉద్యోగ విరమణ చేశారు. ఈ కార్యక్రమంలో ఆయన పాల్గొని వారిని సన్మానించి మాట్లాడారు. ఎందరో ఉద్యోగుల నిరంతర శ్రమ వల్ల ప్రస్తుతం వ్యవసాయ విశ్వవిద్యాలయం ఈ స్థాయిలో ఉందని కితబునిచ్చారు. కార్యక్రమంలో అధికారులు, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

ఎంజీఐటీ విద్యార్థులకు మొదటి బహుమతి


మొదటి బహుమతి సాధించిన విద్యార్థులు

మణికొండ: ఉస్మానియా యూనివర్సిటీ- జర్నలిజం, మాస్ కమ్యూనికేషన్ విభాగం వారు నెల 27వ తేదీ నుంచి నిర్వహించిన 'జశ్న్-ఎ-సైన్మా' జాతీయ స్థాయి షార్ట్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో గండిపేటలోని మహాత్మాగాంధీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఎంజీఐటీ) కళాశాల విద్యార్థులు ప్రథమ బహుమతి సాధించారు. యూనివర్సిటీలోని ఠాగూర్ ఆడిటోరియంలో జరిగిన పోటీల్లో జాతీయ స్థాయిలోని పలు కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు. ఇందులో భాగంగా ఓపెన్‌స్టేజ్ పోటీల్లో నృత్య ప్రదర్శన విభాగంలో ఎంజీఐటీ విద్యార్థులు ప్రతిభ చూపారు. దాంతో ఎంజీఐటీ ప్రిన్సిపాల్ చంద్రమోహన్‌రెడ్డి, అధ్యాపకులు శనివారం విద్యార్థులను అభినందించారు.

బాలుడి అదృశ్యం



రాజేంద్రనగర్: మైనర్ బాలుడు అదృశ్యమైన ఘటన మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. బృందావన్ కాలనీకి చెందిన రోహన్ (10) శుక్రవారం సాయంత్రం 5 గంటల ప్రాంతంలో ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు చుట్టు పక్కల ప్రాంతాలు, బంధువులు, స్నేహితుల ఇండ్లలో వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో వారు శనివారం మైలార్‌దేవ్‌పల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9553955684
9010221230